
# సప్తమాధిపతి

## డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి



కథ

నరశింహాశాస్త్రిగారంటే నాకు గొప్ప గౌరవం. పిట్టంత మనిషి. ప్రభు దర్పంతో ఏమైనా చెయ్యగల నిగ్రహానుగ్రహ సమర్థుడు. పండిత కళ గల ముఖం. జ్యోతిష్య శాస్త్రంలో దిట్ట. క్షిప్రగణపతి ఉపాసకుడు. సామాన్య జనానికి అవసరమయే జాతక ప్రశ్నల మీద సాధికారిత, వాక్శుద్ధితో ఏది చెప్తే అది జరిగి తీరుతుందని చాలా మంది విశ్వాసం. డెభై సంవత్సరాల పైబడిన వయస్సు. మా నాన్నగారితో ఏరా, ఏరా అనుకొనే చనువు.

నా క్లినిక్ పనివేళలు అయిపోయాయి. లేవబోతుంటే నరశింహాశాస్త్రిగారు వచ్చి దిగులుగా కుర్చీలో కూర్చుండిపోయారు. బల్ల మీద రెండు చేతుల వేళ్ళు బిగించి దాని మీద గడ్డం ఆనించి నేలను చూస్తుండిపోయారు.

"ఏం బాబాయి అంత దిగులుగా వున్నారు ఇవ్వాళ?" పలకరించాను.

"శంకరా! చిన్నవాడివయినా, నా దుఃఖం నీ ముందు పరచాలనుందిరా!" ఆయన కళ్ళు తడిశాయి.

"అదేం బాబాయి ఇవాళ, ఇంత యిదిగా! ఎప్పుడూ లేదు, ఇలాగ??" ఆశ్చర్యపోయాను.

కళ్ళవెంట నీరు బొటబొట కార్చేశాడు.

దగ్గరగా వెళ్ళి భుజం మీద చేయి వేసి తట్టాను.

"నిశ్చయంగా శాస్త్రాన్ని నమ్ముకున్నవాణ్ణి. జ్యోతిష విద్య స్వాధీనమయింది. విద్వన్మండలి ప్రశంసలున్నాయి. ఉపాసన, ఫలముంది. కాని, కాని కాత్యాయని విషయంలో ఓడిపోయానురా" అని భోరున ఏడ్చేశారు.

కాత్యాయని ఒక్కగానొక్క కూతురు. చదువుకుంది బ్యాంకులో ఉద్యోగం. అవివాహితురాలు.

ఏడుపు ఎక్కు తగ్గినాక, లేవదీసి బాల్కనీలోకి తీసుకువెళ్ళి, చల్లటి మంచినీరు అందించాను. గటగట తాగేశారు.

"ఇప్పుడేమయింది. బ్యాంకు ఉద్యోగం చేస్తుంది కదా! తనదైన జీవితం- మంచి జీతం- ఇప్పుడు కొత్తగ వచ్చిన ముప్పేంది?"

"శాస్త్రాన్ని నమ్మినవాణ్ణి, ఇప్పటిదాకా వచ్చిన సంబంధాలు జాతకాలు కలవలేకపోవడంతో కలవలేదని త్రిప్పి పంపాను. ఆమె వయసు నలభై పైబడింది. ఇప్పుడు సంబంధాలు రావడం లేదు. ఈ జాతకాల పిచ్చి లేకుంటే బిడ్డ బతుకు మరోలా వుండేది కదా!"

"ఛ! ఛ! ఇదా కారణం- అదిగాదు బాబాయి! 'యద్యత్ భవ్యం భవతి భగవాన్ పూర్వకర్మానురూపం' అని తరచుగా అంటుంటారుగ దా మీరు? పూర్వ జన్మల కర్మ ఫలితం అంటారుగదా మన విషయంలోనూ అంతేగదా?" అని సాంత్వన పరిచాను.

"నిజమేరా స్వానుభవంలో తట్టుకోలేకపోతున్నా వార్ధక్యం ముసురుకుంటోంది. వయసు మీరింది. ఇప్పుడు ఆమె నా ఆధారం పెళ్ళి కాకుండా చేశానని, ఒక చిన్న పిల్ల అందిరా ఇవాళ!!"

"చిన్న పిల్లకేం తెలుసు"

"చిన్న పిల్లకేం తెలుస్తుంది. పెద్దవాళ్ళు అనుకుంటేనే కదా! అంటే పెద్దవారిలో ఈ అభిప్రాయం వుంది కదా? వాళ్ళు ఆ విధంగా మాట్లాడుకుంటుంటే గదా. ఈ చిన్నది విని అన్నది. అదే నన్ను కలచివేస్తున్నది".

"ఇట్లా ఆలోచించి మనసు పాడు చేసుకోకు. ఏ టైంకు ఏం జరగా లో అట్లాగే జరుగుతుంది" ఓదార్చి ఇంటిదాకా వెళ్ళి దిగబెట్టి వచ్చాను.

***

విశ్వం చాలా డిస్టర్బ్‌డ్‌గా వున్నాడు. చిన్ననాటి స్నేహితుడు. గది లోకి వస్తూనే "శంకరా! పిల్లల ఫోన్లతో వేగలేక చస్తున్నానురా! ఫోను వస్తే అరగంట మాట్లాడుతారు. వాళ్ళ దగ్గరకి యు.ఎస్. రమ్మని ఒకటే సతాయింపు ఇప్పుడు కొత్త రాగం అందుకున్నారు" అంటూ కూర్చుండిపోయాడు.

"హాయిగా వెళ్ళొచ్చుగదా! అంతగా పిలుస్తుంటే బాదర బందీలు లేవు!! ఒక్కడివేగదా? ఇక్కడ!"

విశ్వం భార్య కాన్సర్ వ్యాధితో చిన్న వయసులోనే మరణించింది. ఇద్దరు పిల్లలు, వారికి పెళ్ళిళ్ళు అయినాయి వారికి పిల్లలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, గ్రీన్‌కార్డు వచ్చింది అమెరికాలో స్థిరపడ్డారు.

విశ్వం మంచి తెలివైనవాడు ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతున్నపుడే తనకు జాబ్ ఆఫర్ వచ్చింది. మంచి పొజిషన్‌లో వుంటుండగానే భార్యకు బాగా లేకపోవడంతో విఆర్‌యస్ తీసుకున్నాడు. భార్య పోయాక విశ్రాంతంగా సొంత వూరు చేరుకున్నాడు. మూడ్ బాగా లేనప్పుడు తరచు వచ్చి కొద్దిసేపు ఏవో మాట్లాడి వెళ్తుంటాడు.

*విశ్వం చాలా డిస్టర్బ్‌డ్‌గా వున్నాడు. చిన్ననాటి స్నేహితుడు. గదిలోకి వస్తూనే "శంకరా! పిల్లల ఫోన్లతో వేగలేక చస్తున్నానురా! ఫోను వస్తే అరగంట మాట్లాడుతారు. వాళ్ళ దగ్గరకి యు.ఎస్. రమ్మని ఒకటే సతాయింపు ఇప్పుడు కొత్త రాగం అందుకున్నారు"*

"ఏదో కొత్త రాగం అంటున్నారు పిల్లలు అన్నావు ఏమిటది?"

"అదేరా! పిల్లల పోరు. వస్తే ఇక్కడకురా! లేకపోతే మరలా వివాహం చేసుకొని అక్కడే వుండు అంటున్నారు. ఈ వయసులో నాకు పెళ్ళేమిటి?"

"మీ పిల్లలేనా అంటున్నది" కొంచెం ఆశ్చర్యంగా అడిగాను.

"ఎంత ఎదిగారురా? వాళ్ళంటున్నదానిలో కొంచెం ఆలోచించే విషయం వుందిరా. వొంటరితనం భయానకం. తోడు అవసరం. మంచి ఆలోచనే, మంచి సలహానే!" సపోర్టివ్‌గా అన్నా.

"నీతో నా బాధను పంచుకుందామనుకుంటే నువ్వు కూడ వాళ్ళను సపోర్ట్ చేస్తున్నావు. సరి సరి..." అని మూలుగుతూ కుర్చీలో జారగిలబడ్డాడు.

"మోడరన్ పెర్‌స్పెక్టివ్‌తో ఆలోచించు. ఆమె ఎన్నో అనుభూతులు మిగిల్చినా వాస్తవంలో జీవించాలిగదా! ప్రత్యక్షంగాగాని పరోక్షంగా కాని ఒంటరితనం బాధిస్తుంది. పిల్లలు ఇక్కడ వుంటే పరిస్థితి వేరు".



"అయినా ఇప్పుడు కోరికలు ఏమి వుంటాయి?"

"కోర్కెల కోసమని కాదు. మనిషికి మనిషికి తోడు".

"అవతల వచ్చే వ్యక్తి భావ సారూప్యత వుండాలి కదా? లేకుంటే అన్నీ కష్టాలే" అన్నాడు విశ్వం.

"సమకూడే టైముకు అన్నీ అవే వస్తాయి. ఇప్పటిదాకా సాధనావస్థ- ఇప్పుడు సిద్ధావస్థ- ఇది అవస్థా భేదమే!"

"వేదాంతం కాదురా! జీవితం ఇది!"

"అదే నేను చెప్పేది. శేష జీవితం సుఖంగా వుండాలనే కదా, ఈ ప్రయత్నం" అన్నాను.

"అయితే నువ్వు చెప్పేదేమిటిప్పుడు".

"ఒక్కొక్క మనిషి జీవన గమనంలో మజిలీలు అనేకం. ఒక్కొక్క మజిలీ నుండి మరో ప్రయాణం".

"నాకేమి అర్థం కావటం లేదు".

"అర్థమయేట్లు చెబుతాను. నరశింహాశాస్త్రిగారని గొప్ప పండితుడు. వారి అమ్మాయి వుంది. ఇంతకుముందే వచ్చి వెళ్ళారు. జాతకాలు కుదర లేదని, వచ్చిన సంబంధాలు వద్దన్నారు. ఇప్పుడు ఆమె వయస్సు దాటింది అని లబోదిబోమని మొత్తుకుంటున్నాడు. సంప్రదాయ కుటుం బం. నీకిష్టమయితే ఆ సంబంధం ఖాయమవుతుంది" వివరించాను.

ఏదో అతీత మానసిక స్థితి ఏర్పడినట్లు అనిపించింది విశ్వానికి. మనస్సులోని పరస్పర విరుద్ధ భావాలు సంఘర్షితమై సమన్వయం ఏర్పడినట్లు, చైతన్యం నుండి విస్తృత చైతన్యంలోకి మారినట్లుగా వింటున్నాడు.

"సరే అయితే ముందుగా ఆమెతో మాట్లాడాలి వీలైతే ఆ ఏర్పాటు చేయి" అన్నాడు.

వెంటనే ఒప్పుకోవడం నిజంగా నాకు చాలా సంతోషమేసింది.

నరశింహాశాస్త్రిగారు ఈ సంబంధానికి అదీగాక మా స్నేహితుడు అనేప్పటికి వొప్పుకున్నారు. కాత్యాయిని కూడా మాట్లాడేందుకు అంగీకరించింది. నేను ఒక కండిషన్ పెట్టాను జాతకాల ప్రస్తావన లేకుండా వుండాలి అని. ఆయన వొప్పుకున్నారు. అయినా ఆమె జాతక చక్రం తీసుకొని చూస్తూ "ఇప్పుడు సప్తమ స్థానాన్ని బృహస్పతి చూస్తున్నాడు. సప్తమాధిపతి వివాహాయోగ్యతను సూచిస్తున్నది. గ్రహ సంచారం అనుకూలంగా వుంది. శుభం" అంటూ జాతక చక్రాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"నీ ఇష్ట ప్రకారమే నడుచుకుంటా నాయినా" అన్నాడు.

ఒక సాయంత్రంవేళ విశ్వం, కాత్యాయని కూర్చొని మాట్లాడుకునేట్లు ఏర్పాటయింది మా యింట్లోనే. ఒక అరగంటసేపు వారి మధ్య సంభాషణలు పూర్తి అయ్యాయి. నేనుగాని శాస్త్రిగారుగాని కల్పించుకోలేదు. వారి మధ్య మాటలు పూర్తి అయాక ఇద్దరూ నవ్వుకుంటూ బయటికి వచ్చారు.

ముందుగా కాత్యాయని "థాంక్సండీ" అంది.

"రియల్లీ అన్ బిలీవబుల్ సర్‌ప్రైజ్!!" విశ్వం భుజాలెగరేశాడు.

"నాకు అంగీకారమేనండీ!ఆమెకు అంగీకారమైనట్లె అనిపిస్తోంది. వివాహ

ఏదో అతీత మానసిక స్థితి ఏర్పడినట్లు అనిపించింది విశ్వానికి. మనస్సులోని పరస్పర విరుద్ధ భావాలు సంఘర్షితమై సమన్వయం ఏర్పడినట్లు, చైతన్యం నుండి విస్తృత చైతన్యంలోకి మారినట్లుగా వింటున్నాడు.

కార్యక్రమం క్లుప్తంగావుండాలి" శాస్త్రిగార్కి నమస్కరిస్తూ విశ్వం అన్నాడు.

నరశింహాశాస్త్రిగారు నా భుజం తట్టారు ప్రశంసాపూర్వకంగా.

***

ఆఘమేఘాల మీద అమెరికా నుండి వచ్చేశారు విశ్వం పిల్లలు. రాగానే నా దగ్గరకు వచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

"మీ వలన మాకు గొప్ప రిలీఫ్ కలిగింది. బాగా సెలబ్రేట్ చేసుకుందాం, అంకుల్!" ఉత్సాహంగా వున్నారు.

"మీ నాన్న చాలా క్లుప్తంగా వుండాలి అని కండిషన్ పెట్టాడురా" అని నసిగాను. "లేదంకుల్. మీరే ప్లాన్ చేయాలి, ఆయన్ని కన్విన్స్ చేయాలి మీరు" అన్నారు.

వారి ఉత్సాహం నాకు నిజంగా ఓ మాంచి కిక్‌నిచ్చింది విశ్వానికి పిల్లల ఉత్సాహం గురించి చెబితె ఒప్పుకోలేదు. కాత్యాయనిని కదిలించా ఒక పళాన వొప్పుకోలేదు మొత్తం మీద ఒప్పించా. పేచి అల్లా నరశింహాశాస్త్రిగారినించే వచ్చింది.

"నాయనా ఇప్పటికే వారికి ఔపోసనాధికారం వచ్చింది. ఇప్పుడు వివాహ కార్యక్రమంలో ప్రధాన హోమం, లాజహోమము అవసరం లేదు. యోక్త్రధారణ (దర్భ తాడుతో నడుముచుట్టూ మూడు చుట్లు చుట్టి) చతుర్థ వివాహం జరిపించడమే విధానం".

"పిల్లలు సరదా పడుతున్నారు మీరు ఇవన్నీ చెప్తే ఎట్లా?" అన్నాను.

"మాంగల్య సూత్రధారణ, తలంబ్రాలు, అప్పగింతలు వేడుకామాత్రమయినవి. వాటికి అభ్యంతరం లేదు సాంప్రదాయ విధి విధానం. మనం కాకపోతే ఎవరు ఆచరిస్తారు".

నాకెందుకో ఆయన అభిప్రాయం సరైనదేననిపించింది. వివాహ ప్రక్రియకు వుండే పవిత్రత, వేడుక సంతోషాన్నిస్తుంది.

పెండ్లి చాలా ఘనంగా జరిగింది. అప్పగింతలు చేసేప్పుడు విశ్వం తరవున కొడుకు కోడలు తమ కుటుంబంలోకి కాత్యాయనిని స్వీకరించారు. వరుని కుటుంబ సభ్యులకు వివాహ అనంతరం, పాలలో చేతులు తడిపి పెండ్లి కూతురును అప్పజెప్పడం సంతోషంగా స్వీకరించడం సంప్రదాయం.

ఒంటరిగా నిల్చొని కాత్యాయని జాతక చక్రాన్ని వొకసారి పరిశీలించి తృప్తిగా జేబులో వుంచుకున్నాడు నరశింహాశాస్త్రిగారు.